ప్రజాశక్తి

గురువారం 10 నవంబర్ 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

సంక్షోభంలో భవన నిర్మాణ రంగం

- కార్మికుల ఉపాధిని దెబ్బకొట్టిన ఇసుక విధానం
- సంక్షేమ బోర్డు నిర్వీర్యం
- నేడు, రేపు ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు భవన నిర్మాణ కార్మికులకు శాపంగా మారాయి. పెరిగిన ఇసుక, ఇనుము, సిమెంట్ ధరలతో నిర్మాణ రంగం మందగించింది. కార్మికుల ఉపాధికి గండిపడింది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక సరఫరాను నిలిపేసింది. ఎనిమిది నెలల వరకు ఇసుక అందుబాటులోకి రాకపోవడంతో భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఈరంగంలో పనిచేస్తున్న 35 లక్షల కార్మికుల కుటుంబాల పైన తీవ్ర ప్రభావం చూపింది. ఉపాధి కోల్పోయి, కుటుంబాలను పోషించుకోలేక 32 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ వెంటనే కేంద్రం ఆకస్మికంగా కరోనా లాక్‌డౌన్ విధించడంతో మూలిగేనక్కపై తాటిపండు పడిన చందగా మారింది. సుదీర్ఘకాలం ఉపాధి లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు అప్పులపాలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన ఇసుక పాలసీ, కేంద్రం విధిస్తున్న జిఎస్‌టి పన్ను విధానాలతో భవన నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, కంకర, ఇనుము ధరలు భారీగా పెరిగాయి. దీంతో నిర్మాణరంగం మందగించింది. ఉపాధి దొరక్క కుటుంబ పోషణకు భవన నిర్మాణ కార్మికులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో వలసల నివారణకు భవన నిర్మాణరంగానికి ఊతమిచ్చేలా ఉచితంగా ఇసుక అందించి మెటీరియల్ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ డిమాండ్ చేస్తోంది.

సంక్షేమ బోర్డు నిర్వీర్యం : క్లయిమ్‌లు నిలిపివేత

కార్మికులను ఆదుకోవడానికి ఏర్పడిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ప్రమాద వశాత్తు దెబ్బలు తగిలి అంగవైకల్యానికి గురైనవారు, సహజ మరణం, నిర్మాణ రంగంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలు, పెళ్లిళ్ళు, కాన్పులు అయిన కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన క్లయిమ్‌లను ప్రభుత్వం నిలిపివేసింది. 22 వేల మందికి సంబంధించి రూ.52 కోట్లు మంజూరైన క్లయిమ్‌ల నిధులను విడుదల చేయడంలేదు. క్లయిమ్‌లకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జివో 17 ద్వారా సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు, ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని, క్లయిమ్‌లను వెంటనే చెల్లించాలని ఫెడరేషన్ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో జరిగే ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలో సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయనున్నారు.

గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యం

- మూతపడే దుస్థితిలో 30 గ్రంథాలయాలు
- సెస్ బకాయిలు జమ చేయని స్థానిక సంస్థలు
- జిల్లావ్యాప్తంగా రూ.125 కోట్లు పెండింగ్
- ఒక్క విఎంసి నుంచే రూ.80 కోట్లు

ప్రజాశక్తి - విజయవాడ : నిధుల సమస్యతో జిల్లాలో గ్రంథాలయ వ్యవస్థ కునారిల్లుతోంది. గ్రంథాలయాల అభివృద్ధి, విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా కేటాయించడంలేదు. దీంతోపాటు సెస్ రూపంలో గ్రంథాలయాల వాటాగా స్థానిక సంస్థలు చెల్లించాల్సిన డబ్బులను దశాబ్దాల తరబడి చెల్లించడంలేదు. దీంతో విజయవాడ వంటి నగరంలో కూడా గ్రంథాలయాల నిర్వహణ, వాటి అభివృద్ధి పక్కన పెడితే చిన్న పాటి రీడింగ్ రూమ్‌లు కూడా లేవంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రూ.125 కోట్లకుపైగా బకాయిలు

స్థానిక సంస్థలు వసూలు చేసే ఆస్తి పన్నులో నుంచి ఎనిమిది శాతం తప్పని సరిగా క్రమం తప్పకుండా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సెస్ నిధులతోపాటు ప్రభుత్వాలు కేటాయించే నిధులతో గ్రంథాయాలు నడుస్తుంటాయి. కానీ ఈ రెండూ కూడా జరగడం లేదు. ఒక్క విజయవాడ నగరపాలక సంస్థ నుంచే రూ.80 కోట్ల వరకు సెస్ రూపంలో గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా రూ.125 కోట్లకుపైగా సెస్ బకాయిలు 2007కు ముందు నుండి పేరుకుపోయాయి.

పేపర్ల ఖర్చులు కూడా చెల్లించలేని స్థితిలో గ్రంథాలయాలు

ఒక రీడింగ్ రూమ్‌లో కనీసంగా రెండు మూడు పేపర్లు కూడా వేయించలేని దయనీయ పరిస్థితిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదుర్కొంటోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 30 గ్రంథాలయాలకుపైగా మూసివేసే దశకు చేరుకున్నాయి. జిల్లాలోని యలమర్రు, పెదపారుపూడి తదితర గ్రామాల్లో గ్రంథాలయాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. జిల్లావ్యాప్తంగా లెక్కకు 109 గ్రంథాలయాలు, మరో 90 బుక్ డిపాజిట్ సెంటర్లు (బిడిసి) ఉన్నా వీటిలో అత్యధికంగా నడవటం లేదు. కనీసం నిర్వహణ ఖర్చు భరించే స్థితిలో లేవు. జిల్లావ్యాప్తంగా విజయవాడ ఠాగూర్ గ్రంథాలయం వంటి పెద్ద లైబ్రరీలు తొమ్మిది నడుస్తున్నాయి. విజయవాడ, మచిలీపట్నం, జగ్గయ్యపేట, గుడివాడ, నూజివీడు, తిరువూరు, అవనిగడ్డ, నందిగామ, మైలవరం పట్టణాల్లో పెద్ద లైబ్రరీలు ఉన్నా పాఠకులకు అనుగుణంగా వీటి నిర్వహణ ఉండటం లేదు. వివిధ పోటీ పరీక్షల దగ్గర నుంచి సాహిత్య, ఇతర అన్ని రకాల పుస్తకాలు అందించలేని పరిస్థితి ఉంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కనీసం ఒక్క లైబ్రరీగానీ, రీడింగ్ రూమ్‌గానీ లేకపోవడం గమనార్హం.

సిబ్బందికి జీతాల సమస్య

జిల్లావ్యాప్తంగా దీర్ఘకాలంగా గ్రంథాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది జీతాల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సంస్థల నుంచి వచ్చే సెస్ డబ్బుల నుంచే ఉద్యోగులకు జీతాలు చెల్లించాల్సి వస్తుండటంతో నిధులు లేక వారి జీతాలు కూడా చెల్లించే పరిస్థితి నెలకొంది. ఉద్యోగుల జీతాలను 010 పద్దు ద్వారా చెల్లిస్తే గ్రంథాలయ వ్యవస్థపై కొంత భారం తగ్గుతుంది. తద్వారా గ్రంథాలయాల అభివృద్ధికి కొన్ని నిధులనైనా వెచ్చించే అవకాశం ఉంటుంది. వామపక్షాల పాలనాకాలంలో విజయవాడ నగరంలో ప్రతి డివిజన్‌లో రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయడంతోపాటు గ్రంథాలయాల నిర్వహణ ఎంతో బాగుండేదని, ఆనాడు పాఠకులకు వివిధ రకాల పుస్తకాలు, పేపర్లు అందుబాటులో ఉండేవని పలువురు పాఠకులు అభిప్రాయపడుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అవశ్యం

కెవిపిఎస్ నేతలు పాటూరు, మాల్యాద్రి



మహాసభలో మాట్లాడుతున్న అంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - ఉయ్యూరు : కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని మాజీ ఎంఎల్‌ఎ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ పాటూరు రామయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి విమర్శించారు. కేంద్రం విధానాలతో ఆకలి, అంటరానితనం, అణచివేత, కులాధిపత్య ధోరణులు, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు, అసమానతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమన్నారు. కెవిపిఎస్ కష్ణాజిల్లా 6వ మహాసభ అమరజీవి నిమ్మాది ఏడుకొండలు (ఉయ్యూరు) ప్రాంగణంలో బుధవారం జరిగింది. ఈసందర్భంగా పాటూరు మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను పాలకులు అమలు చేయడం లేదన్నారు. పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాల మెడలు వంచి కమిషన్ సిఫార్సులను అమలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెత్తందారులు, కార్పొరేట్లు, మతోన్మాదుల పాలనలో సామాజిక న్యాయం కొరవడుతోందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15,17లో కులవివక్ష, అంటరానితనం నిషేధించినా నేటికీ కొనసాగడం శోచనీయమన్నారు. ఆజాదీకా అమత్ మహోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో నేటికీ దళితులకు కనీసం శాశ్వత శ్మశాన భూముల్లేక రోడ్లు, కాల్వగట్ల పక్కన అంతిమ సంస్కారాలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక వేత్తలకు వేల ఎకరాలు భూములు ధారాదత్తం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల శ్మశాన వాటికలకు అవసరమైన భూములను కేటాయించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో దళితుల పట్ల వివక్ష చూపుతున్నాయన్నారు. సామాజిక అంశాలపైన, సమానత్వం కోసం కలిసివచ్చే ప్రజా సంఘాలను ఐక్యం చేసి కులతత్వానికి, మతతత్వానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తొలుత పాటూరు రామయ్య కెవిపిఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కెవిపిఎస్

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పాటూరు రామయ్య

(మిగతా 6లో)

ఝూన్సీరాణిని సత్కరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

అవార్డు గ్రహీత ఝూన్సీరాణికి కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యుత్తమ సేవలు అందించినందుకుగాను మిరియాల ఝూన్సీరాణి రాష్ట్రపతి చేతుల మీదగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు పొందటం జిల్లాకే గర్వకారణమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. వైద్య రంగంలో ఉత్తమ సేవలందించినందుకు నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికై రాష్ట్రపతి నుండి అవార్డు స్వీకరించి బుధవారం నగరానికి చేరుకున్న మిరియాల ఝూన్సీరాణిని కలెక్టర్ ఎస్ డిల్లీరావు తన కార్యాలయంలో దుశ్శాలువాతో సత్కారించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఝూన్సీరాణి భర్త కోవిడ్ బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు కూడా ధైర్యంగా ఆస్పత్రి రోగులకు సేవలందించి మన్ననులను పొందారన్నారు. ప్రభుత్వ నర్సుగా ఆమె అందించిన సేవలకుగాను 2016లో పోలీస్ కమిషనర్ నుండి గోల్డెన్ సిటిజన్ అవార్డుతోపాటు వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా కలెక్టర్లు పలు స్వచ్ఛంద సంస్థల నుండి ఉత్తమ సేవా అవార్డులను పొందారన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఎపిఎన్‌జిఒ నాయకులు ఎ.విద్యాసాగర్, జె స్వామి, కె.సంపత్ కుమార్, బివి.రమణ, సివిఆర్ ప్రసాద్, నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కె.శివలీల, షమిబేగం, జాన్సన్‌రాణి పాల్గొన్నారు.

చీమలపాడులో ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి-ఎ.కొండూరు: సూఫీ షెహన్షా హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి చరిత్రాత్మక తొలి ఉరుసు ఉత్సవ్-2022 బుధవారం చీమలపాడులో ఘనంగా జరిగింది. ఈ మేరకు రెండో రోజు జరిగిన ఉరుసు ఉత్సవ్‌లోని కీలక ఘట్టాలను అతావుల్లా బాబా వారసులు, చీమలపాడు, విజయనగరం దర్గా-దర్బార్‌ల పీఠాధిపతులు ఎండీ ఖ్వాజా మోహియుద్దీన్, ఎండి ఖలీల్ షరీఫ్‌షా వెల్లడించారు. చరిత్రాత్మక తొట్ట తొలి సుగంధ మహక్షత్సవం సూఫీ సైద్ధాంతిక సంప్రదాయం ప్రకారం వేలాది మంది మధ్య ఘనంగా జరిగింది. ఈ మహత్తర కార్యానికి అజ్మీర్ బాబా గరీబ్ నవాజ్ వారి దర్గా నుంచి ఖాదీం అజీమ్ హస్మి తదితరులు హాజరై పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా దర్గాలో ఉదయం ఖురాన్ పఠనం, ఫకీరు మేళా నిర్వహించారు.

మధ్యాహ్నం లంగర్‌లో అన్న సమారాధన ద్వారా ప్రసాదాన్ని అందించారు. సాయంత్రం ఫకీరు మేళా, తప్పెట గుళ్ళు, పులి వేషాల బృందాలు, వివిధ కళా రూపాలు, డప్పు వాయిద్యాల సందడితో పుర వీధుల్లో అతావుల్లా బాబా వారి సందల్ (ఊరేగింపు) అంగరంగ వైభవంగా జరిగింది. ఉరుసు ఉత్సవాలకి విచ్చేసిన వేలాది మంది భక్తులు అతావుల్లా బాబా వార్కి చాదర్, పూలు, సుగంధాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. బాబే బుగ్దాద్ లంగర్‌లో బుధవారం రాత్రి వేలాది మందికి భారీ అన్న సమారాధన జరిగింది. బాబా వారి కుమారులు జాఫర్ బాబు, ఖాదర్ బాబు, ఆయన శిష్యులు మరిశర్ల సీతాపతిరావు ఉరుసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్అండ్‌బి రహదారి అధ్వానం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మైలవరం-విస్సన్నపేట ఆర్అండ్‌బి రహదారి రోజురోజుకు అధ్వానంగా తయారవుతుంది. గత మూడు సంవత్సరాలుగా ఈ రహదారి ఇలాగే ఉంటూ అనేక ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా విస్సన్నపేట రెడ్డిగూడెం మధ్య ప్రయాణం చేయాలంటే వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిందే. ఈ రెండు మండలాల మధ్య ఉన్న ఆర్అండ్‌బి రహదారిపైన భారీ ఎత్తున లారీలు తిరుగుతూ ఉండట వనల భయంకరమైన గోతులమయంగా తయారయ్యి రాకపోకలకు అంతరాయం కలగటమే కాకుండా ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. ఈ రహదారి నిర్మాణం కొరకు నిదులు మంజూరై ఉన్నప్పటికీ ఎందుకు ఆలస్యం జరుగుతుందో అర్థం కావటం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం వెళ్లిపోయింది కాబట్టి ఇకనైనా ఈ రహదారికి మరమ్మతులు చేపడుతారేమో వేచి చూడాలి.

మండల సమైక్య సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి-వత్సవాయి: మండల మహిళా సమైక్య అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నిక కాబడిన గంగిపోగు శిరీష రమేష్‌లను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మండలంలోని లింగాలలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను అభివృద్ధి పథంలో నడిపించడానికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఏసుపోగు దేవమని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలోని రామచంద్రపురం గ్రామం ఎస్సీ కాలనీలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే రక్షణనిధిని కోరారు. బుధవారం రామచంద్రపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చాట్ల సుధాకర్, సిహెచ్ వీరాస్వామి, వార్డు సభ్యురాలు గుండ్రు సుశీల, గొల్లమందల కోటేశ్వరరావు, బి.శివ తదితరులు పాల్గొన్నారు.

15న సిఐటియు మహాసభ

ప్రజాశక్తి-వీరులపాడు

సిఐటియు వీరులపాడు మండల మహాసభ జుజ్జూరు గ్రామంలో 15వ తేదీన జరగనున్నట్లు మండల కార్యదర్శి లాల్ అహ్మద్ తెలిపారు. ఈ మహాసభలో మండలంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కార్తీక దీపాల గ్రామోత్సవం

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గంలోని ఊర్మిళానగర్‌లో వేంచేసియున్న శ్రీ మాత గోవింద మంబా సమేత శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం నిర్వాహకులు కంది శ్రీనివాస రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక దీపాల గ్రామత్సవం నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని మహిళలు అమ్మ వారికి కార్తీక దీపాలతో గ్రామ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి సంభాన దుర్గాచార్య మరియు దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

11 వరకు తృతీయ బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి తృతీయ బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకూ అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొండపల్లి ఎపిహెచ్ఎంఎల్ పెట్రోల్ బంకు సమీపంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా చేశారని టిడిపి కౌన్సిల ర్లు ఆరోపించారు. ఆక్రమణకు గురవుతున్న స్థలం కొండపల్లిలో విజయవాడ భద్రాచలం జాతీయ రహదారి పక్కన ఉన్నప్పటికి ఈ వివాదంపై అధికారులు ఎవరు నోరు మెదపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. టిడిపి మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం కబ్జా స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో దర్జాగా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు చేస్తున్నారని ప్రశ్నించారు. కబ్జాదారుడు ఐదు సెంట్ల ప్రభుత్వ పట్టాన్ని చూపించడంతో అధికారుల వ్యవహార శైలి బయటపడిందని గతంలో పంచాయితీ తీర్మానం చేసిన ప్రభుత్వ స్థలాన్ని కాపాడలేని స్థితిలో అధికారులు ఉండటం దౌర్భాగ్యం అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు చెన్నబోయిన చిట్టిబాబు, కరిమికొండ శ్రీలక్ష్మి, ధరణికోట విజయలక్ష్మి, జల్లి జ్యోతి, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చుట్టుకుదురు వాసు, చనుమోలు నారాయణ, రావి ఫణి, కొత్తపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

రైతులకు త్వరలో నష్టపరిహారం : జెసి

ప్రజాశక్తి-కంచికచర్ల

జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు 15 రోజుల్లో నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల సమీపంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన 25 మంది బాధిత రైతులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పరిటాల లో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు, సర్వీస్ రోడు 8 లైన్ల రహదారిగా విస్తరించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ రహదారుల సంస్థ పర్యవేక్షణలో రోడ్డు విస్తరణ పనులు పూర్తయి జాతికి అంకితం అయిందన్నారు. బాధిత రైతులకు నష్టపరిహారం విషయమై చర్చించిన ఆమె 15 రోజుల్లో నష్ట పరిహారం రైతుల ఖాతాల్లోకి జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి రాజకుమారి, బీటీ నాగులు మీరా, ఆర్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ కోరుతూ జెన్‌కో ఒప్పంద కార్మికుల వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఎపిపిడిసిఎల్ ఒప్పంద కార్మికులను 39 మందిని ఎపి జెన్‌కోలో పర్మినెంట్ ఉద్యోగులుగా నియామకం చేయడానికి ఖండిస్తూ డాక్టర్ ఎన్‌టిటిపియస్ చీఫ్ ఇంజనీర్‌కు బుధవారం కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఏసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల జెఏసి నాయకులు మాట్లాడుతూ ఎపిడిసిఎల్ ఒప్పంద కార్మికులను జిఓ నెం.163 ప్రకారం ఎపిజెన్‌కోలోకి పర్మినెంట్ ఉద్యోగులుగా నియామకం చేయడం కార్మిక వ్యతిరేక చర్య అని అన్నారు. జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ముఖ్యమంత్రి మాకు ఇచ్చిన హామీని గుర్తు చేసుకుని తమను పర్మినెంట్ ఉద్యోగులుగా నియామకం చేయాలని తెలిపారు. 39 మంది ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేసిన ప్రకారం తమను పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో

తెలుగునాడు కాంట్రాక్టు కార్మిక సంఘం ఎఐటియుసి హెచ్ 43 ఇతర కార్మిక సంఘ నేతలు మందడపు దుర్గారావు, దర్శనపు స్వతంత్రకుమార్, ఆకునూరి రత్నశేఖర్, దేవరకొండ మల్లిఖార్జునరావు, వి అప్పారావు, బివి సురేష్, శ్యాం కుమార్, ముళ్లపూడి కృష్ణ, మురళి, మహేష్ పాల్గొన్నారు.

వాడీవేడిగా పరిటాల పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-కంచికచర్ల

పరిటాల గ్రామ పంచాయతీ పాలకవర్గ సాధారణ సమావేశం సభ్యుల ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య వాడివేడిగా జరిగింది. బుధవారం గ్రామ సర్పంచ్ యద్దనపూడి ఆనంద జ్యోత్స్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి ఎజెండా ప్రవేశ పెట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలో టెండర్ ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు కార్మికులు ఉన్నారు. ప్రతిరోజూ 30 మంది మాత్రమే విధులకు హాజరవుతారని, ఇటీవల రోజుకు 45 మంది పనులకు హాజరౌతున్నట్లు లెక్కల్లో చూపి నిధుల డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారని టిడిపికి చెందిన బోర్డు సభ్యులు మాగంటి కోటి రామయ్య, భాస్కర్ తదితరులు ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చే విధంగా సర్పంచ్, కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనికి తోడు పారిశుధ్య కార్మికుల జీతాలు కాంట్రాక్టర్ ఖాతాకు జమ చేయకుండా, గ్రామ పంచాయతీ పేరుతో బ్యాంకులో మరో ఖాతా తెరిచి, ఆ ఖాతా నుండి నిధులు డ్రా చేయటం ఎవరి ప్రయోజనం కోసమని నిలదీశారు. దీనిపై స్పందించిన సర్పంచ్ పారిశుధ్య కార్మికుల నిర్వహణకు టెండరుదారులు తక్కువ కూలీకి టెండర్ వేశారని, అయితే ఆ కూలీ గిట్టుబాటు కానందున అదనపు మచ్చుర్లు వేసి ఆ డబ్బులు కూడా కార్మికులకే ఇస్తున్నామన్నారు. దీనికి అభ్యంతరం వ్యక్తం చేసిన సభ్యులు ప్రస్తుతం కార్మికులకు కూలీ గిట్టుబాటు కాని టెండర్ రద్దు చేసి, కార్మికుల చేతనే వారికి కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా, రీ టెండర్ వేసి జిల్లా ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని జీతాలు చెల్లించాలన్నారు. మరో సారి ఇలాగే కార్మికుల పేరుతో అదనపు డబ్బులు డ్రా చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడితే కోర్టు ను ఆశ్రయించాల్సి వస్తుందని సభ్యులు పేర్కొన్నారు. అలాగే శానిటేషన్ కార్యక్రమాలు, వీధి దీపాల, మంచి నీటి నిర్వహణ కొరకు కొనుగోలు చేసిన సామాన్లు వివరాలు ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి, సభ్యులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ తారాబి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

విద్యావంతులను ప్రేరణగా తీసుకొని విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

విద్యార్థులు తమ పరిసరాలలో విద్య ద్వారా ఉన్నత స్థానాలను చేరుకున్న వ్యక్తుల గురించి తెలుసుకొంటూ వాళ్ళను ప్రేరణగా తీసుకొని పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి లోని ఎస్సీ బాలికల వసతి గహాన్ని బుధవారం సందర్శించి అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు .ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో అన్ని రకాల సదుపాయాలు ,వసతులు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి గురించి కలలు కంటూ వాటిని సాధించడానికి నిరంతరం అత్యంత ఇష్టంగా విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని,దాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. అనంతరం ప్రతిభ చూపుతున్న విద్యార్థినులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.కోటయ్య, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మేడేపల్లి సుబ్బారావు ,వసతిగహ అధికారిణి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి -మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలో జరుగుతున్న స్పెషల్ బిఇడి పరీక్షలను, హిందూ కాలేజీ లోని బిఇడి పరీక్షలను, కష్ణా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న ఎల్. ఎల్. బి. పరీక్షా కేంద్రాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ కే. బి. చంద్ర శేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్ష జరుగుతున్న తీరుపట్ల సంతప్తిని వ్యక్తం చేశారు.

వ్యాసరచన పోటీలో సెయింట్ జాన్స్ ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం : ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, దాగియున్న సజనాత్మకతకు తగిన ప్రోత్సాహం అందిస్తే అద్భుత ఫలితాలు సాధిస్తారనడంలో సందేహం లేదని సెయింట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్. సంతోష్ కుమార్ తెలిపారు. పెట్రోలియం కన్జర్వేషన్ రీసెర్చ్ ఆసోషియేషన్ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి వ్యాస రచనా పోటీలో పాల్గొన్న తమ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని దేవరపల్లి రేచెల్ శ్రీ విద్య తెలుగు వ్యాస రచనలో జాతీయ స్థాయి ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం జరిగింది.సంతోష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో డాక్టర్ కంకట సుబ్బారావు ప్రత్యేక శిక్షణ లో 2017సంవత్సరంలో ప్రథమ , ద్వితీయ స్థానాలను , 2018 సంవత్సరంలో ద్వితీయ స్థానాన్ని , 2019 సంవత్సరంలో రెండు రాష్ట్ర స్థాయి బహుమతును, 2022 సంవత్సరంలో జాతీయ బహుమతి, రాష్ట్ర బహుమతిని పొందిందన్నారు. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం హాజరైన ప్రతి విద్యార్థి కి ప్రథమ ద్వితీయ స్థానాలను సాధించడం విశేషమని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని రెవ. బ్రదర్. జిమ్మి కురియోకోస్, రెవ. బ్రదర్. భల్లా జోసఫ్ , ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అభినందించారు.

బాలికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్

రాష్ట్రంలో అరాచక పాలన : మాజీ మంత్రి ఉమా

ప్రజాశక్తి-పెదపారుపూడి : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ ఏతప్పు చేయకపోయినా అయ్యన్నపాత్రున్ని అర్ధరాత్రి అరెస్టు చేయడం తప్పితే, రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు కనిపించకుండా పోయాయని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించే విధంగా చర్యలు చేపట్టాలని ఉమా సూచించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాములలో సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ దాల్వా పంటకు నీరు ఇవ్వలేమని చెప్పటం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రతిపక్షాలను అణగదొక్కడం తప్ప, ప్రభుత్వానికి ప్రజలకు మేలు చేద్దామన్న ఆలోచన లేకుండా పోయిందని విమర్శించారు. పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా, మండల టిడిపి అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, నాయకులు నాగదేసి విజయ ప్రకాష్, కలపాల కిషోర్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవినేని ఉమామహేశ్వరరావు

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల

చలికాలంలో ఆరోగ్యం విషయాలలో జాగ్రత్తలు పాటించా లని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పద్మజ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ వేగం విద్య మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుబ్బారావు, కష్ణమోహన్ సచివాలయం ఆశ వర్కర్లు పెద్దల వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ఆగిరిపల్లి రోడ్లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణంలోని ఆగిరిపల్లి రోడ్డులో ఆక్రమణలను పోలీసులు, పంచాయతీ అధికారులు కలిసి బుధవారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఎక్కువ అవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనేకసార్లు పంచాయతీ వార్డు మెంబర్లు, స్థానికులు అధికారులు దష్టికి తెచ్చిన విషయం తెలిసిందే. కొందరు షాపు యజమానులు కూడా ఫుడ్ పాత్రను ఆక్రమించి షాపులు కట్టేశారు. మరికొందరు తోపుడుబండ్లు, టీ దుకాణాలు, పానీపూరీ దుకాణాల్లో పెట్టించి అద్దెలు వసూలు చేస్తున్నారు. ఈ ఆక్రమణలతో రోడ్డంతా తగ్గిపోయి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గన్నవరం సిఐ కెవివిఎన్ సత్యనారాయణ రంగంలోకి దిగారు. పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ను, సిబ్బందిని రంగంలోకి తీసుకొచ్చారు. షాపుల యజమానులతోనూ, అద్దెకు తీసుకుని వ్యాపారాలు చేస్తున్న వారితోనూ మాట్లాడి పంచాయతీ స్థలాన్ని మార్కింగ్ చేయించారు. దానికి ఇవతల ఉన్న కట్టడాలన్నీ తీసివేయాలని ఆదేశించారు. ఆ తర్వాత జెసిబి తీసుకువచ్చి డ్రైనేజీకి ఆనుకుని వేసిన ర్యాంపులను తొలగించారు. మరో నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సిఐ తెలిపారు. వ్యాపారులు, షాపుల యజమానులు సహకరించాలని కోరారు. అయితే రోడ్డు పక్కనే తోపుడుబండ్లు పైన వ్యాపారాలు చేసుకునే వారిని పూర్తిగా వెనక్కి జరిపి పెట్టుకోవాలని చెప్పారు. గన్నవరం ఎస్సై శ్రీనివాసరావు, సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పాపులర్ షూమార్టు 60వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

పాపులర్ షూ మార్టు 60వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 10వ తేదీన నగరంలోని ఎస్. ఎస్. కన్వెన్షన్ హాల్ నందు జరుగుతాయని సంస్థ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చుక్కపల్లి పిచ్చయ్య స్థాపించిన సంస్థ 60 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మార్గ దర్శి చిట్‌ఫండ్స్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్ పాల్గొంటారని, గౌరవ అతిథిగా శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకు లు పద్మభూషన్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీలు వందశాతం అమలు : వంశీ

ప్రజాశక్తి -హనుమాన్ జంక్షన్ : ఎన్నికల ముందు నాడు ప్రజాప్రస్థానం పాద యాత్రలో ఇచ్చి న హామీలను ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంద శాతం అమలు చేశారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లీ సచివాలయం -1 పరిధిలో ఆర్ పి హెచ్ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ది వివరాల కరపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దేశంలోని మిగతా రాష్ట్రాలక ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. అర్‌పిహెచ్ కాలనీలో రహదారులు పాడై నడవలేకపోతున్నామని స్థానిక మహిళలు ఎమ్మెల్యే వంశీ దష్టికి తీసుకురాగ వెంటనే స్పందించిన అయన అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కొలతలు వేయించి త్వరలో రోడ్లు నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నగేష్ , జడ్పీటిసిలు గంగాభవానీ, ఎలిజబెత్ రాణీ , మండల పార్టీ అధ్యక్షుడు నక్కాగాంధీ, కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, షేక్ తానీషా, మాజీ సర్పంచ్ నందమూరి కష్ణప్రసాద్, మండల ఎస్సీ సెల్ నాయకులు తోమ్మండ్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - భవానీపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ ఆధ్వర్యంలో భవానీపురంలోని ఏపి టూరిజం డెవలప్‌మెంట్ అండ్ కార్పొరేషన్, బెరం పార్కులో బుధవారం 112వ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్ టాప్‌స్టార్, మాక్సివిషన్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-1 లయన్ జె.ఎన్. శంకర్ గుప్తా, గవర్నర్-2 లయన్ గద్దె శేషగిరి పాల్గొని రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, ఈసీజీ, హార్ట్ చెకప్, ఆర్థోపెడిక్, కంటి పరీక్షలు, దంత సమస్యలు, జనరల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైనవారికి మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించటం ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ ప్రెసిడెంట్ జాస్తి శ్రీనివాసరావు, కార్యదర్శి కోమటి కిరణ్ కుమార్, క్యాంపు నిర్వాహకులు జి.రామకృష్ణ, దేవినేని ఆర్టీ, రావి సురేష్‌బాబు, టాప్‌స్టార్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. తాటినేని శ్రీనివాసరావు, పోలవరపు నరసింహారావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-భవానీపురం: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గలో ఉన్న ఎస్సి బాలుర కళాశాల హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ మెస్ చార్జీలు రాకపోవడంతో పౌష్టికాహారం అందడం లేదన్నారు. విద్యార్థులుకు నాసిరకం ఆహారం పెడుతూ ప్రభుత్వం నెట్టుకొస్తోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్

వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఛార్జీలు రాక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లాలో అన్ని హాస్టల్స్‌లో తాగునీరు, మరుగు దొడ్ల సమస్య ప్రధాన సమస్యగా నెలకొన్నాయన్నారు. ప్రధానంగా కొన్ని వసతి గహాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రతి నెలా హెల్త్ చెకప్ నిర్వహించడంలో వార్డెన్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా హాస్టల్ సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గోపినాయక్, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బి.సత్యాబాబు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో...

న్యాయ సేవా దినోత్సవం

ప్రజాశక్తి-నందిగామ : న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా బుధవారం నందిగామ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు లక్ష్మీ రాజ్యం, రమణారెడ్డి, న్యాయవాదులు సబ్ కోర్టు ప్రాంగణం నుండి గాంధీ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ చట్టాల్లో ఉన్న అధికారాలను ప్రజలకు తెలియజేశారు. న్యాయ సేవా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలు పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం, న్యాయవాదులు పి.మార్కెండేశ్వరరావు, యర్రంరెడ్డి బాబురావు, గింజుపల్లి రమేష్ బొందలపాటి రామకష్ణ, దర్శి అర్జున్, నండ్రు శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** న్యాయసేవా దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ కె.శ్రావణి, అదనపు ఛైర్మన్ ఎం.శోభారాణి ఆధ్వర్యంలో న్యాయవాదులు షేర్‌మహమ్మద్‌పేట, చిల్లకల్లు గ్రామాలలో ఇంటింటికి న్యాయ సేవలు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు న్యాయ సేవల గురించి వివరించి, చట్టాలపై అవగాహన కల్పించారు.

చిల్లకల్లులో పొలంబడి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామ సమీపంలో బుధవారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ సమగ్ర సక్షరక్షణ కేంద్రం విజయవాడ, మండల వ్యవసాయ అధికారులు పత్తి పంటను పరిశీలించారు. గత 14 వారాలుగా జరిపిన పత్తి పంటలో ప్రయోగాలు గురించి, రైతుల యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించారు. రైతులు ఇరువిగా విత్తన శుద్ధి, చిగురు అట్టలు, జీవన ఎరువుల వాడకం, కాండం బొట్టు పద్ధతిని ఉపయోగించి సాగుబడి ఖర్చులు విరివిగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దక్షిణమూర్తి, వీరబాబు, సురేష్, మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నందిగామ: రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత ప్రయోజనాలు ఉంటాయని ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. అంబారుపేట గ్రామంలో రూ.21.8 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ సంబంధిత సామాగ్రి, అవసరమైన సమాచారం, సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లోనే అందుబాటులో ఉంటూ రైతులకు సేవలందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐలపోగు రమా రామయ్య, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, గరికపాటి భాస్కరం, శివ నాగేశ్వరరావు , పంచాయతీరాజ్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిక్ ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ గివింగ్

ప్రజాశక్తి-కంచికచర్ల: మిక్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే జాయ్ అఫ్ గివింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా

కళాశాల విద్యార్థులు ప్రతిఒక్కరు ఒక్కో వస్తువుగాని, నిత్యావసర సరుకులు గాని పండ్లు, బట్టలు వంటి వాటిని వితరణగా ఎన్ఎస్ఎస్ విభాగానికి అందిస్తారని తెలిపారు. వాటన్నిటిని సేకరించి అనాథ శరణాలయాలకు, వృద్ధాశ్రమాలకు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం కూడా విద్యార్థులు, అధ్యాపక బృందం అందించిన 20 రకాల నిత్యావసరాలను విజయవాడలోని మదర్ థెరిస్సా ప్రేమ్ దాన్ ఆశ్రమానికి వితరణగా అందించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.రాజేష్ తెలిపారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్


మాట్లాడుతున్న సుందరయ్య

ప్రజాశక్తి-ఎ.కొండూరు: జగన్ పాదయాత్ర సందర్భంగా సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సిపిఎస్ రద్దు చేయలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 9వ తేదీ వచ్చినా జీతాలు అందలేదన్నారు. సంవత్సర కాలంగా పిఎఫ్, డిఎ, ఎపిజిఎల్ఐ, బకాయిలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏ కొండూరు మండల అధ్యక్ష కార్యదర్శులు బి.దుర్గారావు, కె.ఉమాదేవి, మండల నాయకులు విశ్వభారతి, సూర్య, ఇసాక్, బి.రమేష్, తేజస్విని, కృష్ణకుమారి, బి.భూపతి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపైనా ఆసక్తి చూపాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడా సంబరాలను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువత చదువుతో పాటు క్రీడలపై కూడా అధిక ఆసక్తిని చూపించాలన్నారు. జగనన్న క్రీడా సంబరాల్లో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం, జడ్పీ పాఠశాల పీడీ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఏడుకొండలు, కౌన్సిలర్ యాకూబ్ అలీ, కట్టప్ప, కరీముల్లా పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాలేదు

వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఖాదర్ బాషా

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్రంలో వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో పని చేస్తుంటే, కొన్ని పత్రికలు, ప్రతిపక్షాలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ విమర్శలకు దిగుతున్నాయని ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ వి.ఖాదర్ బాషా అన్నారు. బుధవారం విజయవాడ వన్‌టౌన్‌లోని ఇందాద్‌ఘర్ బిల్డింగ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో గల వక్ఫ్ భూములు, దర్గాలను పరిశీలించి, వివరాలు సేకరించినట్లు చెప్పారు.

నిపుణుల కమిటీని పెట్టి కారు చవగ్గా భూములు ఇచ్చేస్తున్నామని కొన్ని పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, అది నిజం కాదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నలుగురు సభ్యులతో కమిటీ వేశారని, ఫైనాన్స్ నుంచి పీపీపీ కన్సల్టెంట్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్, ఇద్దరు సాంకేతిక నిపుణులతో కలిసి, తాను ఛైర్మన్‌గా కమిటీ వేశారని తెలిపారు. వీరందరితో కలిసి అన్యాక్రాంతమైపోతున్న 55 వాణిజ్య ఆస్తులను ఎలా లీజుకివ్వాలో పరిశీలించామని వివరించారు. ఓపెన్ ఆక్షన్లో కేటాయించి, వచ్చే నగదును పేదలకు ఎలా పంచాలో ఆలోచన చేస్తున్నామని తెలిపారు. విశాఖలో వందెకరాల భూములున్నాయని, వాటిని లీజుకివ్వాలనుకుంటే చట్టప్రకారం చేస్తామని స్పష్టం చేశారు. తమపై ఒత్తిళ్లు వస్తున్నాయనేది పూర్తిగా అవాస్తవమని, మసీదు కమిటీలు వేసుకుంటూ వెళ్తున్నామన్నారు. ఇప్పటికే ఆక్రమణలపై 2323 నోటీసులు జారీ చేశామని స్పష్టం చేశారు.

కాంతారావుకు పరామర్శ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామంలో ప్రముఖ న్యాయవాది అన్నెపాక కాంతారావు కుమారుడు రాహుల్ మాదిగ ఈ నెల 7వ తేదీన మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కష్ణమాదిగ మంగళవారం రాత్రి కాంతారావు కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల సురేష్‌పై దాడి జరిగిన నేపథ్యంలో సురేష్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యండ్రాంతి కోటేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

12న తిరువూరు నుంచి పంచారామాలకు బస్సు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నుండి పంచారామాలకు ఆర్‌టిసి బస్సు ఈ నెల 12 శనివారం రాత్రి 12.30 గంటలకు బయలుదేరుతుందని డిపో మేనేజర్ వేణు బుధవారం తెలిపారు. టికెట్ ధర రూ.1260 అని, బస్సు తిరువూరు నుండి విజయవాడ మీదుగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వెళ్తుందన్నారు. దర్శన అనంతరం తిరిగి విజయవాడ మీదుగా తిరువూరు వచ్చేందుకు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. తిరువూరు రిజర్వేషన్ కౌంటర్‌లో కూడా టికెట్లు తీసుకోవచ్చని, వివరాలకు 9885661835, 7382904011 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

జగనన్న క్రీడా సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్ ఏపీజే అబ్దుల్ కలాం ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాలను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన తనయుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ గౌస్‌లజమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడలను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మూడు రోజులు పాటు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలను నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గ స్థాయిలో ఆడి గెలిచినవారు జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయిలో గెలుపొందాలన్నారు. అనంతరం బాయ్స్ హైస్కూల్‌లో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా రూ.1.32 కోట్లతో 11 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్, రాష్ట్ర పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, జడ్పిటిసి ఊట్ల నాగమణి, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ నూకల సాంబ, మోరే బాబి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడపా మురళి, ఎస్సై రామారావు, గేమ్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని

పోటీలను ప్రారంభిస్తున్న ఉదయభాను

బాలురు హైస్కూల్‌లో 2021-22 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మాలోతు శ్రీహరి తల్లిదండ్రులు మలోతు మక్యానాయక్, బొడమ్మల జ్ఞాపకార్థంగా మెమొంటోలను ఉదయభాను అందజేశారు. జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన మంగోలు గ్రామానికి చెందిన గోలి శిరీష్‌ను అభినందించారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

● మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

లోక్‌అదాలత్‌లతో సామాన్య ప్రజానీకానికి సత్వర న్యాయ పరిష్కారం దొరుకుతుందని కష్ణాజిల్లా మొదటి అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు అన్నారు. బుధవారం న్యాయ సేవల దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్ లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ కోర్టుల్లో కేసులు ఎంతో కాలంగా పెండింగ్ లో ఉండిపోవడం, న్యాయం పొందడంలో జాప్యం జరుగుతున్న కారణంగా సత్వర న్యాయ పరిష్కారానికి ఈ లోక్ అదాలత్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. న్యాయ సహాయం అవసరమైన పేదవారికి ఆయా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా సత్వర న్యాయం అందించడం లోక్‌అదాలత్ల ప్రధాన ధ్యేయమని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలకు రాజీ మార్గం ద్వారా సమాన న్యాయం అందిస్తుందని, తద్వారా సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ సత్వర న్యాయ పరిష్కారం పొందాలనుకునే వారికి లోక్ అదాలత్లు ఒక గొప్ప మార్గాలు అన్నారు. కార్యక్రమంలో ముందుగా డిఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.పద్మ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహనా సదస్సు కార్యక్రమాలు, పరిష్కరించిన కేసుల వివరాలను తెలియజేశారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి జిల్లా కోర్టు సెంటరు వరకు విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్మెనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ డా. ఎం. రామకష్ణ, 6వ అదనపు జిల్లా జడ్జి ఎస్. చిన్నబాబు, 9వ అదనపు జిల్లా జడ్జి డా. షేక్ మహ్మద్ ఫజులుల్లా, 10వ అదనపు జిల్లా జడ్జి ఏ. నరసింహమూర్తి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ఆర్ కె.ప్రసాద్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టం అందరికీ సమానమే

ప్రజాశక్తి-గన్నవరం : జాతీయ న్యాయ సేవ దినోత్సవ సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఆదేశాల ప్రకారం స్థానిక గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ దాసరి భాగ్యలక్ష్మి అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న గన్నవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమర్తల సోమేశ్వరరావు మాట్లాడుతూ న్యాయ సేవ దినోత్సవం ప్రాముఖ్యత, బాలలకు సంబంధించి వివిధ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శారదా, స్వామి, ప్రకాష్, విమల కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** జాతీయ న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా జిల్లా సివిల్ కోర్టు జడ్జి సుధాకర్ రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సామాన్య ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లుగా జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సతీష్, బంటుమిల్లి ఎస్ఐ పైడి బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చంద్రికను అభినందిస్తున్న యాజమాన్యం

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

బాపులపాడు మండలం వీరవల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అర్నేపల్లి చంద్రిక జాతీయస్థాయి జూనియర్ షటిల్ బాల్ టోర్నమెంట్‌కి ఎంపికయినట్లు పాఠశాల పిడి ఆర్. అశోక్ కుమార్ తెలిపారు. గత నెల సెప్టెంబర్ 26 నుండి 28 వరకు నంద్యాల జిల్లా, కోయిలకుంట్లలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ షటిల్ బాల్ టోర్నమెంట్ లో మంచి ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి జూనియర్ షటిల్ బాల్ క్రీడలో ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల నవంబర్ 11 నుండి 14 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్ర, విధిష పట్టణంలో జరుగబోయే జాతీయ జూనియర్ షఉటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటున్నట్లు తెలిపారు. చంద్రిక ఎంపికపట్ల పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయరాలు ఎన్ అనితశ్రీ, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ రమణగోపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఐరన్ కంపెనీలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం చిన్న అవుటపల్లి పరిధిలోని అపెక్స్ కాస్టింగ్ కంపెనీలో ప్రమాదం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో సత్యనారాయణ, శ్రీనివాసరావు, నతుర్, భవాని శంకర్ ఉన్నారు. కంపెనీలో పని చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ అయి బ్లాస్ట్ అయ్యింది. దగ్గరలో పని చేస్తున్న నలుగురు గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ యన్ ఆర్ ఐ హాస్పిటల్ తరలింపు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళన చేస్తున్న దృశ్యం

కౌలు రైతు కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

గుడివాడ: అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు లేళ్ల నాగరాజు కుటుంబ సభ్యులకు న్యాయం చెయ్యాలని కోరుతూ కౌలురైతు సంఘం ఆద్వర్యంలో స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి.పి.రెడ్డి, నాయకులు బి.వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సాయం అందించడానికి 14 రకాల రిపోర్టులు అడుతున్నారని, సాయం తిరస్కరించడానికే ఇలాంటి కుంటిసాకులు చెబుతున్నారన్నారు. నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఏ డిఈ రమాదేవి కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంగం నాయకులు గంట అక్కయ్య,మాతంగి కష్ణ, ఐద్వా కార్యదర్శి పి.రజని, సహాయ కార్యదర్శి బసవ అరుణ,మహిళ సంగం సీనియర్ నాయకురాలు షౌకతున్నీసా, పెనుమాక సుబ్రహ్మణ్యేశ్వరి, విజయలక్ష్మి, రేమల్లి అబ్రహాము, చేగొండి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు

గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

స్వామిత్వా కార్యక్రమం క్రింద గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సర్వే, పంచాయతీ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి స్వామిత్వ కార్యక్రమం క్రింద గ్రామాల్లో చేపట్టిన సర్వే పురోగతి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామకంఠాల్లో స్థలాలు కొలతలు వేసి సర్వే చేయడం, ఎసెస్మెంట్ నెంబర్లు కేటాయించడం స్వామిత్వ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ 39 గ్రామాల్లో స్వామిత్వ చేపట్టి ఇప్పటి దాకా 5 గ్రామాల్లో (13వ నోటిఫికేషన్) సర్వే పూర్తయిందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. మహేష్ కుమార్ రావిరాల, డిపిఓ నాగేశ్వరనాయక్, జడ్పి సిఇఓ జి. శ్రీనివాసరావు, డిఎల్ ఓ సుబ్బారావు, ఏడీ సర్వే గోపాల్ రాజ్, సూపర్నెంట్ కోఆర్డినేషన్ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి శివారు రావి వారిపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన అధ్యక్షునిగా మూడవ సారి ఏకగ్రీవంగా రావి లక్ష్మణరావు ఎన్నికయ్యారు. సోమవారం రావి లక్ష్మారావు ప్యానల్ నామినేషన్లు దాఖలు చేయగా 9 మంది డైరెక్టర్లతో బోర్డు ఏర్పడింది. 9 మంది సభ్యులలో రావి లక్ష్మణ రావును అధ్యక్షునిగా బుధవారం బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్టర్ కోఆపరేటివ్ డిపార్ట్మెంట్ కు చెందిన ఎండిఎస్ జాన్సన్ ఎన్నికలు నిర్వహించి, వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం ఆధ్వర్యంలో బుధవారము గౌతమి నేత్రలయం రాజమండ్రీ వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది.ఈ శిబిరం లో ఆప్టొమెట్రిస్ట్ సిహెచ్ రాజేష్ 15 మందికీ కంటి పరీక్షలు నిర్వహించి, అయిదుగురికి శస్త్ర చికిత్సలు అవసర మన్నారు. వారికి రాజమండ్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తా మన్నారు. ప్రతి నెల 2వ, 4వ బుధవారాలలో వైద్య శిబిరం నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు కారుమూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చేబ్రోలు ఆశీర్వాదం, వైస్ ప్రెసిడెంట్ రాఘవరావు, ట్రెజరర్ శంకర రావు, జాయింట్ సెక్రటరి బి కె దుర్గారావు, యం సత్య నారాయణ, సయ్యద్ పీర్ గౌతమి నేత్రాలయం ప్రోగ్రాం మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిగా ఫణి

ఉంగుటూరు :

ఉంగుటూరు మండల స్థాయిలో మండల సంక్షేమం, అభివద్ధి కార్యకలాపాలను పర్యవేక్షిం చడం కోసం ఉంగుటూరు మండల స్పెషలాఫీసర్ గా ఎం, ఫణి ధూర్జటి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం స్పెషలాఫీసర్‌గా పదవి బాధ్య తలు స్వీకరించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో పంచాయతీ సెక్రటరీలతో సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

11న మహిళా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :కష్ణా యూనివర్సిటీలో ఈనెల 8వ తేదీ వర్సిటీ ఉపకులపతి, స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ ఆచార్య కె బి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశమై వార్షిక క్యాలెండర్ ఆవిష్కరించిన పిమ్మట వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలకు కొన్ని బాధ్యతలు అప్పగించారు. దీనిలో భాగంగా ఈనెల 11 న మహిళాటేబుల్ టెన్నిస్ టోర్నమెంట్, యూనివర్సిటీ జట్టు ఎంపిక లాంటి కార్యక్రమాలు వర్సిటీ లోని ఇండోర్ స్టేడియంలో జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం బాబురెడ్డి తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని యూజీ, పీజీ కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు వాళ్ళ కళాశాల ఫిజికల్ ట్రైనర్ లేదా ఏదైనా టీచర్ ఆధ్వర్యంలో వచ్చి ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకల్లా రిపోర్టు చేయాలన్నారు. యూజీ వాళ్ళు అయితే ఎస్ఎస్‌సి, ఇంటర్ మార్క్స్ మెమో జిరాక్స్, అదే పీజీ వాళ్ళు అయితే ఎస్ఎస్‌సి, ఇంటర్,డిగ్రీ మార్క్స్ మెమోల జిరాక్స్ తో రావాలని తెలిపారు.

ప్రధాన రహదారి మధ్యలో గొయ్యి

● వాహనదారుల తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండలంలోని కొడాలి నుంచి శ్రీకాకుళం మధ్యలో తెలుగురావుపాలెం గ్రామం వద్ద ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి పడింది. ఈ రహదారిలో భారీ స్థాయిలో శ్రీకాకుళం నుంచి ఇసుక టిప్పర్లు తిరుగుతుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో అని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఘంటసాల మండల పరిధి నుంచి కరకట్ట మీదగా విజయవాడ వెళ్ళు వందలాది వాహనాలు నిత్యం ఈ రహదారిలో తిరుగుతూ ఉంటాయి. ఇదే రహదారిలో నిత్యం జిల్లా మండల స్థాయి అధికారులు సైతం ప్రయాణిస్తూ ఉంటారు అయినప్పటికీ రెండు రోజుల నుంచి ఆర్ అండ్ బి అధికారులు గానీ ఇతర ప్రభుత్వ అధికారులు గానీ ఈ గుంతను ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరిగితే గాని పట్టించుకోరా అని వాహన చోదకులు భయపడుతున్నారు.

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వై.నరసింహారావు

విమానాశ్రయ నిర్వాసితుల పోరాటానికి అండగా ఉంటాం

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి - గన్నవరం : విమానాశ్రయ విస్తరణ నిర్వాసితుల పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు చెప్పారు. ఉధృత ఆందోళనల ద్వారానే బాధితులకు న్యాయం జరిగే పరిస్థితి నెలకొందన్నారు. విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా గన్నవరం మండలం దావాజీగూడెంలో నిర్వాసితులు చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని బుధవారం సిపిఎం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని అప్పటి టిడిపి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం బాధిత నిర్వాసితులకు, రైతులకు న్యాయం చేయడానికి ముందుకు రావడంలేదని విమర్శించారు. ఇళ్లు కోల్పోయి అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకు బకాయిలు పెట్టిందని గుర్తుచేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో పక్కా ఇళ్లు కట్టిస్తామని చెప్పిన మాట నీటి మూటలవుతున్నాయని విమర్శించారు. కనీసం ఇల్లు కట్టుకోడానికి ఒక్కో కుటుంబానికి ఇస్తామని చెప్పిన రూ.9 లక్షలు కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, టివి.లక్ష్మణస్వామి, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, మరియదాసు, మల్లంపల్లి జయమ్మ, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిర్వాసితుల పోరాట కమిటీ స్పష్టం చేసింది. ఈఉద్యమానికి తిరువీధి ఏసురత్నం నేతృత్వం వహించారు.

రాజ్యాంగ పరిరక్షణ అవశ్యం

(మొదటి పేజీ తరువాయి)

రాజేష్, గోపాల్

జిల్లా అధ్యక్షులు కొడాలి శర్మ అధ్యక్షతన మహాసభ జరిగింది. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజేష్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు తదితరులు మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురాల రాజేష్ సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు అమరజీవి నిమ్మాది ఏడుకొండలు చేసిన సేవలను నాయకులు కొనియాడారు.

తీర్మానాలు

మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. జిల్లాలో ఎస్‌సిలకు గ్రూప్ వన్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, మచిలీపట్నంలోని అంబేద్కర్ భవనాన్ని పునర్నిర్మించాలని, ఉపాధి హామీ చట్టాన్ని గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ అమలు చేయాలని, 300 యూనిట్లు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టిలకు జగజ్జీవన్‌రామ్ ఉచిత విద్యుత్ పథకం షరతులు లేకుండా కొనసాగించాలని, దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని, జిఓ నెంబర్ 1235 ప్రకారం ప్రతి గ్రామంలోనూ దళితుల శ్మశాన అవసరాలకు రెండు ఎకరాల భూమి కొని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

కెవిపిఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకుంది. కృష్ణాజిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా చీకటి రాజేష్, నిమ్మాది గోపాల్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గానికి ఆర్.రఘు, కొడాలి శర్మ, ముళ్లపూడి విల్సన్, కిషోర్, అంబటి శ్రీనివాసు, ప్రశాంతిలను ఎన్నికయ్యారు. కమిటీకి శ్యామ్సన్, ప్రత్తిపాటి సుధాకర్, రాజు, రంగారావు ఎన్నికయ్యారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల పాత్ర కీలకం

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల పాత్ర కీలకమని, అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. నగరంలోని మొగల్రాజపురం పిబి సిద్దార్థ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం స్వీప్ (సిస్టమేటిక్‌ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్)లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో డ్రాఫ్ట్ పబ్లికేషన్, బిఎల్వోలు అందుబాటులో ఉంటారని ఓటర్‌గా నమోదు కాని వారు అన్‌లైన్, ఆఫ్లైన్ విధానంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓటుహక్కు కలిగి ఉండటం ఓటర్ డేటాకు ఆధార్ అనుసంధానంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించే నాటికను ప్రదర్శించారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలిత ఓటు హక్కు నమోదు పై అవగాహనా ర్యాలీని ఇందిరాగాంధీ మున్సిపల్

ర్యాలీని ప్రారంభిస్తున్న ముఖేష్

స్టేడియం వద్ద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ డిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు ర్యాలీ స్టేడియం నుండి ప్రారంభమై మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియానికి చేరుకుంది. జెసి నుపూర్ అజయ్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సేవలపై కేంద్రం బృందం నివేదిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కష్ణా) : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 15వ సాధారణ సమీక్ష మిషన్ బందం ఈనెల 6 నుండి 9వ తేదీ వరకు కృష్ణాజిల్లాలో పర్యటించింది. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అమలు చేస్తున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను కలిసి వివరాలు తెలుసుకుంది. ఈబృందంలో వైద్యులు త్రిపాఠి షిండే, ఆసీమా పట్నాకర్, రష్మి వాద్వా, శ్రీశుభోద్ జైస్వాల్, ప్రీతి ఉపాధ్యాయ, అభిషేక్ దదిచ్, అనికేట్ చౌదరితోపాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుండి వచ్చిన వైద్యులు శ్రీదేవి, సుబ్రహ్మణ్యం శిరీష, రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి, పోగ్రాం అధికారులు జిల్లాలోని జిల్లా కేంద్ర వైద్యశాల, ప్రాంతీయ వైద్యశాలతోపాటు ఎంపిక చేసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పట్టణ ఆరోగ్య కేంద్రాలను, డాక్టర్ వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్లలను పరిశీలించారు. ఈ అంశాలపై బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి నివేదిక అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి జిల్లాలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలకు సంబంధించి ప్రోగ్రాం అధికారులైన డాక్టర్ శర్మిష్టా, డిఐఒ డాక్టర్ వెంకట్రావు, డిటిసిఒ డాక్టర్ సుదర్శన్ బాబు, డిపిఎంఒ డాక్టర్ విజయభారతి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ రత్నగిరి వివరించారు.



కలెక్టర్‌తో సమావేశమైన కేంద్ర బృందం

దస్తావేజులు పోయినవి

మైలవరం మండలం, మైలవరం గ్రామానికి చెందిన బయన జగదీష్ తండ్రి శ్రీనివాసరావు కు మైలవరం గ్రామంలో ఆర్.ఎస్.నెం. 146/1 దాఖలా చ.గ.440.94 స్థిరాస్థి నివేశనా స్థలం కలదు. సదరు స్థలంను నేను షేక్ అబ్దుల్ నబీ వగైరాల నుండి క్రయం పొంది మైలవరం సబ్‌రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం.1384/2020గా రిజిస్టరు పొంది యున్నాను. సదరు స్థలంకు సంబంధించి లింకు డాక్యుమెంట్‌ను నేను క్రయం పొందినవారి వద్దనుండి కొనుగోలు చేయు సమయంలో పొందియున్నాను. సదరు లింకు డాక్యుమెంటు నెం.1077/1994, 2612/1998 అయివున్నది. ఆ స్థలంనకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటును మైలవరంలోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుచుండగా దారిలో జారిపోయింది. ఎంత వెదికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

బయన జగదీష్,
తండ్రి.శ్రీనివాసరావు,
డోర్.నెం 16-187/ఎ,
రామకృష్ణా కాలనీ,
మైలవరం,
సెల్.నెం 9676651007

పొలం డాక్యుమెంట్స్ పోయినవి

చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామానికి చెందిన నాదెళ్ల గురు వెంకటరమణరావు సర్వే నెం. 146-6లో య.1.34 సెంట్లు దస్తావేజు నెం. 273/2004 పొలం డాక్యుమెంట్ సెప్టెంబర్ 6వ తేదీ నడకుదురు నుండి చల్లపల్లి వెళ్లే మార్గమధ్యంలో పోయినవి. ఈ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో నాకు సమాచారం ఇవ్వవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు
నాదెళ్ల గురు వెంకటరమణారావు,
సెల్ నంబర్. 9505132980

<u>పత్రికా ప్రకటన</u>

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు

<u>ఒ.ఎస్. నెం. 355/16</u>

<u>వాది:</u> కురెళ్ళ శ్రీనివాసరావు

మరియు

<u>ప్రతివాదులు:</u> ఆకుల కృష్ణకుమారి మరియు వగైరాలు

<u>2వ ప్రతివాది:</u> పసుపులేటి ప్రమిళ రాణి, భర్త: రవికుమార్, డోర్ నెం. 4-151, రాధమాధవి టాయోటా, రాధ మాధవి ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రసాదంపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా.

పై నెంబర్ దావా గ్రంధము నందు హాజరు నిమిత్తము సమనులు మీ అడ్రస్‌నకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్టు ద్వారాను పంపించినారు. వాటిని మీరు అందుకోవడం లేదు. అందువలన మీరు **ది. 11-11-2022వ తేదీన ఉదయం 10.30 నిమిషాలకు** స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ వాదనలు తెలియపరచుకోవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావాలో తీర్మానించెదరని, ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

కె.వెంకటేశ్వరరావు
టి.గంగరాజు
ఏలూరు — వాది తరపున న్యాయవాది
తేది:09-11-22 — ఏలూరు, సెల్:939039832

ప్రకటన

మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 302/2022

Between:
అందె తిరుమలరావు మరియు మరియొక్కరు ...వాదులు

And

అందె రమణయ్య మరియు ఇతరులు ...ప్రతివాదులు
D3:అందె ఆంజనేయులు, S/o.లేటు దుర్గారావు
D4:అందె ఉమమహేశ్వరరావు, S/o.లేటు దుర్గారావు
D3&D4 are residents of D/No:63-4-8, పుట్టరోడ్డు, పటమటలంక, విజయవాడ అర్బన్ కృష్ణాజిల్లా-520010
D5:నందం హిమరాణి, W/o నందం తిరుమలరావు, పుట్టరోడ్డు, పటమటలంక, విజయవాడ అర్బన్ కృష్ణాజిల్లా-520010.
D10:అందె వెంకటేశ్వరరావు, S/o. మల్లిఖార్జునరావు R/o. 6th వార్డు, నున్న, కృష్ణాజిల్లా.

పై నెంబరు దావాలో వాదులు సూట్ షెడ్యూల్ ప్రాపర్టి డిక్లరేషన్ అండ్ కాన్‌సీక్వెన్షియల్ రికవరీ ఆఫ్ పొసెషన్ అండ్ కాన్సిలేషన్ ఆఫ్ డాక్యుమెంట్ మరియు ఇతర రిలీఫ్స్ కొరకు దావా దాఖలు చేసికొనియున్నారు. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా తేది.06-12-2022న మీ నోటీసు కొరకు వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన పై కోర్టు వారి ఎదుట ది.06-12-2022న ఉదయం గం॥10-30ని॥లకు మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలియజేయని ఎడల సదరు దావాను మీ పరోక్షమందు తీర్మానం చేయబడునని యిందుమూలంగా తెలియ పరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది:06-12-2022

ఇట్లు
వంగర కిషోర్,
అడ్వకేట్, మంగళగిరి.

ప్రకటన

ఆన 2022వ సం. నవంబరు నెల 9వ తారీఖున నా క్లయింట్లు మరియు కృష్ణాజిల్లా విజయవాడ కాపురస్తులు అయిన 1) శ్రీ యమ్మాని పిచ్చయ్య గారి కుమారుడు వెంకటేశ్వరరావు గారు మరియు వీరి కుమారుడు 2) యమ్మాని వెంకట సాయి కిరణ్ గార్ల యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా, ఈ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తి శ్రీ వెంకట సత్య కన్‌స్ట్రక్షన్స్, విజయవాడ వారి తరుపున పార్టనర్స్: **1) శ్రీ పేటేటి ఉదయ భాస్కర్ గారు మరియు 2) అకుల రవిశంకర్** గార్ల వద్ద కొనుగోలు చేయుటకు నిశ్చయించుకొని బయానా ఇచ్చియున్నారు. సదరాస్తి శ్రీ వెంకట సత్య కన్‌స్ట్రక్షన్స్, విజయవాడ వారి తరుపున పార్టనర్స్: **1) శ్రీ పేటేటి ఉదయ భాస్కర్ గారు మరియు 2) ఆకుల రవిశంకర్** వారికి మరియు (లేటు) చినపువ్వుల వెంకటేశ్వరరావు గారి ఫ్యామిలి కమ్ లీగల్ హైర్స్ అయినటువంటి 1) చినగంధం నాగ వెంకట వరలక్ష్మి గారు, 2) చినపువ్వుల నాగ వెంకట రామ్‌ప్రసాద్ గార్ల మధ్య జరిగిన ది.24-03-2022వ తేదిన విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో డెవలప్‌మెంట్ అగ్రిమెంటు కమ్ జనరల్ పవరాఫ్ అటార్నీ నెం.3565/2022 ద్వారా సంక్రమించియున్నది. దిగువ తెలిపిన చ.గ.237.17లు స్థిరాస్తిని పైన తెలిపిన చినపువ్వుల వెంకటేశ్వరరావు గారు వారి జీవితకాలములో ది.16-03-1964వ తేదిన విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో క్రయ దస్తావేజు నెం.1111/1964 ద్వారా తమ్మన అంజయ్యగారి కుమారుడు తమ్మన సూర్య ఆంజనేయులు వగైరాల వద్ద నుండి కొనుగోలు చేసి అప్పటినుండి వారి సర్వ సంపూర్ణ హక్కు భుక్తములలో ఉన్నట్టి ఆస్తిని వారు సర్వ హక్కులతో అనుభవించుచూ ఏవిధమైన ఏర్పాట్లు చేయకుండా ది.26-04-2007వ తేదిన పరమపదించి యున్నారు మరియు వారి శ్రీమతి గారైన చినపువ్వుల కమల కుమారి గారు కూడా ది.30-12-2012వ తేదిన పరమపదించి యున్న దరిమిలా దిగువ తెలిపిన చ.గ.237.17లు స్థిరాస్తి హిందూ వారసత్వ చట్టరీత్య (లేటు) చినపువ్వుల వెంకటేశ్వరావు గారి ఫ్యామిలీ మెంబర్స్ కమ్ లీగల్ హైర్స్ అయినటువంటి 1) చినగంధం నాగ వెంకట వరలక్ష్మి గారు 2) చినపువ్వుల నాగ వెంకట రామ్ ప్రసాద్ గార్లకు సంక్రమించియున్నది. కనుక ఈ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఎట్టి క్లెయిములు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల ఈ దిగువ అడ్రసుకు ప్రకటన తేది నుండి 10 రోజులలోపు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. దరిమిలా వచ్చు అభ్యంతరములు నా క్లయింట్లును ఈ విక్రయ లావాదేవినీ బైండు చేయజాలవనిన్నీ మరియు ఈ ఆస్తిని నిష్పేచీగా భావింతురని యావన్మందికి ఇందుమూలముగా తెలియజేయటమైనది.

<u>షెడ్యూల్: ఏ-షెడ్యూలు (స్థల వివరం):</u> కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన కేదారేశ్వరపేట, 5వ లైనులో యున్నట్టి ఆస్తికి మున్సిపల్ వార్డు నెం.16, దరిమిలా వార్డు నెం.17, రెవెన్యూ వార్డు నెం.8, బ్లాకు నెం.3, యన్.టి.యస్.నెం.16, అసెస్మెంట్ నెం.2309, ప్రస్తుత అసెస్మెంట్ నెం.122571, క్రొత్త అసెస్మెంట్ నెం.1073050052, డోరు.నెం.18-8-12రు దాఖలా చ.గ.237.17 లు నివేశన స్థలమునకు హద్దులు: **తూర్పు:** గువ్వా సూర్యనారాయణ గారి ఆస్తి, **దక్షిణం:** యమ్మాని వెంకటేశ్వరరావు గారి ఆస్తి, **పడమర:** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం:** చిన్నపువ్వుల శ్రీ లక్ష్మి తులసి అపర్ణ, చినగంధం నాగరాజారావు గార్ల ఆస్తి-- ఈ హద్దుల మధ్య చ.గ.237.17లు లేక చ.మీ.198.31ర్లు స్థిరాస్తి స్థలములో అనిర్ధిష్టపు జాయింటు హక్కులు గల చ.గ.29.75 లు లేక చ.మీ.24.87ర్లు స్థిరాస్తి స్థలము హక్కున్నూ--. <u>బీ-షెడ్యూల్: (కట్టడ వివరం):</u> పైన ఏ-షెడ్యూలు నెంబర్లు దాఖలా మొత్తము స్థలములో నిర్మించబడియున్న శ్రీ నాగ వెంకట కమల నివాస్ అను పేరు గల గృహ సముదాయము నందు సెకండ్ ఫ్లోరులోని, అసంపూర్తి ఫ్లాట్ నెం.301 దాఖలా ఫ్లాట్‌కు హద్దులు: **తూర్పు:** ఫ్లాట్ నెం.302రు దాఖలా ఆస్తి, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** కారిడార్- ఈ హద్దుల మధ్య చ.అ.750.0లు (ప్లింత్ ఏరియా, చ.గ.100.లు కామన్ ఏరియాతో సహా), చ.అ.100.0లు పార్కింగ్ ఏరియాతో సహ మరియు సదరు ఫ్లాట్ కట్టడములకు సంబంధించిన యావద్వి శిష్ట కలప వగైరా సామానులతో సహాయన్నూ.

తేది. 09-11-2022
స్థలము: విజయవాడ

సి.యస్.యస్.ఆర్ వేణుగోపాల్-అడ్వకేట్,
26-20-15, 2వ అంతస్తు, స్వామీ వీధి,
గాంధీనగర్, విజయవాడ-520003.

IN THE COURT OF THE HON'BLE I ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 614 OF 2019

BETWEEN:
B. Nirmala and Others ...**Petitioners**

AND

Navata Road Transport & others ...**Respondents**

To,
R-3: S. Siva Reddy, S/o. Abura Reddy,
Aged: Major, Occ: Driver,
R/o. D.No. 61-15-2, Ramalingeswara Nagar, Vijayawada Urban,
Krishna District-620013.

<u>NOTICE</u>

Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and Respondent No. 1 & 2. Several times notices were issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on 05-12-2022 for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT)
Sd/- L.R.PRAKASH,
K. RANJITH KUMAR,
K. DIVYA,
Advocates,
Secunderabad.
Cell: 9866611022

IN THE COURT OF THE HON'BLE I ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 615 OF 2019

BETWEEN:
B. Mamatha and Others ...**Petitioners**

AND

Navata Road Transport & others ...**Respondents**

To,
R-3: S. Siva Reddy, S/o. Abura Reddy,
Aged: Major, Occ: Driver,
R/o. D.No. 61-15-2, Ramalingeswara Nagar, Vijayawada Urban,
Krishna District-620013.

<u>NOTICE</u>

Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and Respondent No. 1 & 2. Several times notices were issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on 05-12-2022 for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT)
Sd/- L.R.PRAKASH,
K. RANJITH KUMAR,
K. DIVYA,
Advocates,
Secunderabad.
Cell: 9866611022

ఇసుక కొరత లేకుండా చూడండి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

ఇళ్ల నిర్మాణాలు, నాడు-నేడు, ప్రాధాన్యత భవనాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్ లో హౌసింగ్, విద్య, పంచాయతీరాజ్, మైనింగ్ శాఖల అధికారులతో ఆయా నిర్మాణాలకు అవసరమైన ఇసుక సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రొయ్యూరు స్టాక్ యార్డులో 6,038 మెట్రిక్ టన్నులు, కనుమూరు స్టాక్ యార్డులో 12,686 మెట్రిక్ టన్నులతో కలిపి మొత్తంగా 18,724 మెట్రిక్ టన్నుల ఇసుక ఆయా యార్డులలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జగనన్న లేఅవుట్ల ఇళ్ల నిర్మాణాలకు, నాడు-నేడు కార్యక్రమం క్రింద పాఠశాలల్లో చేపట్టే పనులు, ప్రాధాన్యతా భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమోదించబడిన పనులకు ఇసుక ఎంత మేరకు అవసరమయ్యేది ఆయా శాఖల అధికారులు మైనింగ్ శాఖ అధికారులకు జాబితాను పంపాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఆర్ . మహేష్ కుమార్, మైనింగ్ శాఖ డీడీ కె.సుబ్రహ మణ్యేశ్వరరావు, ఏడి బి. రవికాంత్, హౌసింగ్ పీడీ శ్రీధర్, డ్వామా పీడీ జివి. సూర్యనారాయణ, డిఎల్ ఓ సుబ్బారావు, జడ్పి సీఇఓ జి.శ్రీనివాసరావు, ఎస్ఇ పీఆర్ ఈరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

టిడిపితోనే గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి

• మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గం ఓటర్లు చాలా చైతన్యవంతులని గతంలోనే పుచ్చలపల్లి సుందరయ్య ను ఎమ్మెల్యే గా గెలిపించిన ఘనత వారిదేనని మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. బుధవారం గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం, ఆర్టిపిఎస్ శిక్షణ కార్యక్రమం నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో జరిగింది. శాసనమండలి సభ్యుడు మరియు టీడీపీ ఇంచార్జి బచ్చుల అర్జునుడు అధ్యక్షత వహించారు. నారాయణ రావు మాట్లాడుతూ... నియోజక వర్గంలో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ఘనవిజయం సాధిస్తుందని భరోసా వ్యక్తం చేశారు. టిడిపితోనే గన్నవరం అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, సాగునీటి వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, గన్నవరం పార్టీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, బాపులపాడు పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, ఉంగుటూరు పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి ,విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్ల చిన్న రామారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం బదుడే బదుడు కార్యక్రమం నిర్వహించారు.

గడపగడపకూ మనప్రభుత్వం

ప్రజాశక్తి-నాగాయలంక : నాగాయలంక గ్రామ సచివాలయం-1 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన లబ్ధిని వివరిస్తూ స్థానిక సమస్యలపై అధికారులకు సూచనలిస్తూ పరిష్కరించారు. ఈ సందర్భంగా వాటర్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు తమకు కోచ్ సదుపాయం లేదని విన్నవించుకోగా క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిగడ్డలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో 104 ఉచిత వైద్య శిబిరం ఆధ్వర్యంలో అరబిందో మెడికల్ సర్వీసెస్(ఏఈఎంఎస్) ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామాలలో వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళు 104 వైద్యాధికారి డాక్టర్ సిద్దినేని గోపాలకృష్ణమూర్తి, వేకనూరు పీహెచ్‌సి సెంటర్ వైద్యులు నాగార్జున, డీఈవో బి స్వాతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సిద్దినేని గోపాలకృష్ణమూర్తి

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-పెడన

రాష్ట్రంలో పేదల జీవితాలలో మార్పు తెచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే తారక మంత్రంగా పరిస్తూ అద్భుతమైన పాలన అందిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కొనియాడారు. బుధవారం ఆయన పెడన నియోజకవర్గంలోని కొంకేపూడి గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఆయన గ్రామీణ ప్రాంతంలో సురక్షితమైన తాగునీరు సరఫరా చేయడానికి కొంకేపూడి పంచాయతీ పరిధిలోని కొంకేపూడి, ఈదుమూడి, కట్లపల్లి గ్రామాలకు 1 కోటి 14 లక్షల రూపాయల వ్యయంతో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు పథకం కింద చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత పెడన మున్సిపాలిటీ పరిధిలోని 5 వ వార్డుకి చెందిన సుల్తానా బేగంకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్ ఓ సి అందించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలు విన్నవించగా అక్కడే ఉన్న అధికారులకు చెప్పి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెడన మార్కెట్ కమిటీ చైర్పన్ గరికిపాటి చారుమతి రామానాయుడు, ఎంపీపీ రాజులపాటి వాణి అచ్యుతరావు, సర్పంచ్ దావు భైరవ లింగం, మండల పార్టీ అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, కార్యదర్శి పామర్తి సాంబశివరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బెజవాడ నాగబాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో రూ.26.45 లక్షల విలువైన డ్రైనేజ్ పనుల నిర్మాణాలకు మాజీ మంత్రి, బందరు శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య(నాని) శంకుస్థాపనలు చేశారు. బుధవారం ఆయన మచిలీపట్నం కార్పొరేషన్ 1వ డివిజన్ లోని దేవుడు చెరువు నుంచి ఆనంద్ పేటకు వెళ్లే రోడ్డు, అదేవిధంగా 41వ డివిజన్ లోని 3 స్థంబాల సెంటర్ నుంచి చల్లపల్లి బైపాస్ రోడ్డు పరిధిలో నూతన సీసీ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా తమ డివిజన్‌లో డ్రైనేజ్ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తీసుకురావడంతో రూ.26.45 లక్షల వ్యయంతో నూతన సీసీ డ్రైనేజ్‌లను నిర్మించడానికి నిధులను మంజూరు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, నగర కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ సిలార్ దాదా, ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వి శాంతకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ బి పార్వతి ముఖ్య అతిథిగా పాల్గొని ఓటు రిజిస్ట్రేషన్ గురించి తెలిపారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుండి కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో పాల్గొన్న తాసిల్దార్ ఎల్ వి ఎస్ రామకృష్ణ ఓటర్ నమోదు ఓటర్ కార్డులో మార్పులు చేర్పులు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ఏ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ వీర కుమారి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె రవితేజ, చరిత్ర అధ్యాపకురాలు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతను తెలిపే నినాదాలు చేశారు.

దళ్వా సాగుకు అనుమతివ్వాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు దాళ్వా పంట వరి సాగుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరుతూ కృష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు కోరారు. ఈ మేరకు జిల్లా రైతు సంఘం నాయకులు, బంటుమిల్లి మండల రైతులు తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాగేశ్వ రరావు మాట్లా డుతూ బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వా పంటకు వరి సాగుకు అనుమతులిచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు. అనుమతి ఇవ్వని పక్షలు గురువారం నుంచి నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, సుజ్ఞానం జనార్దన్ రావు బంటుమిల్లి మండలం రైతు నాయకులు వంగల రాజు, గౌరిశెట్టి వెంకన్న, గౌరిశెట్టి నాగరాజు, సుంకర పాము, వీరంకి కోటేశ్వరరావు, బండారు నాగ చంద్ర, ప్రతి గాంధీ, పుప్పాల సూర్యనారాయణ, రేలే సత్యనారాయణ, కోనసాని చిన్న, కృత్తివెన్ను మండలం రైతు సంఘం అధ్యక్షులు పట్టపు ఏసుబాబు, బుద్దన బాబి, పుప్పాల నరసింహారావు, పాశం సూరిబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

వాటర్ టన్నెల్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఎస్ఆర్ అండర్ వాటర్ టన్నెల్ ఎక్స్‌పోను వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ బుధవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు దుబాయ్, మలేషియా, సింగపూర్ ప్రాంతాలకే పరిమితమైన వాటర్ టన్నెల్ ఎక్స్ పోను బందర్ రోడ్డు ఎ కన్వెన్షన్ రోడ్‌లోని వజ్ర గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు, ఆహ్లాదానికి అందరూ దూరం అవుతున్న వేళ విజయవాడ నగరంలో కొత్త ప్రపంచం ఆవిష్కృతమైందన్నారు. అండర్ టన్నెల్ వాటర్‌లో రకరకాల చేపలు వున్నాయని, ఈ చేపలు కనువిందు చేస్తున్నాయని అన్నారు. నిర్వాహకులు కార్తికేయ శ్రీనివాస్, మహ్మద్ షమ్మి, అడపా ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్ఆర్ అండర్ వాటర్ టన్నెల్ పేరిట ఏర్పాటు చేసిన ఎక్స్ పోలో కనీవినీ ఎరుగని రీతిలో రంగు రంగుల చేపలతో ఈ ఎగ్జిబిషన్ అందరికీ ఆహ్వానం పలుకుతుందన్నారు. టన్నెల్‌లో 250 కేజీల చేప మాత్రం ఈ ఎగ్జిబిషన్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు చూపుతిప్పుకోకుండా చేస్తుందని తెలియజేశారు. అంతే కాకుండా జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ఈ

ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రెహానా నాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ చెస్ విజేత ప్రియాంక

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అక్టోబర్ 26 నుండి నవంబర్ 3వ తేది వరకు డిల్లీలో జరిగిన ఆసియన్ కాంటినెంటల్ 2022 చెస్ ఛాంపియన్ షిప్ మహిళా విభాగంలో ద్వితీయ బహుమతిని విజయవాడ కానూరుకు చెందిన నూతక్కి ప్రియాంక గెలుపొందారు. రాబోయే ప్రపంచ వరల్డ్ కప్ చెస్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తనను కలిసిన నూతక్కి ప్రియాంక కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మట్లాడుతూ మహిళలు క్రీడల పట్ల ఆసక్తి చూపించి విజేతలు కావడం ఆనందకరమన్నారు. ప్రపంచ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపిని స్ఫూర్తిగా తీసుకొని నూతక్కి ప్రియాంక ప్రపంచ కప్ అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు.

వెలంపల్లి ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటి వద్ద వెలంపల్లి ఫౌండేషన్ చైర్మన్ వెలంపల్లి సాయి అశ్విత పేద చిరు వ్యాపారికి టిఫిన్ వ్యాపారం చేసుకునేందుకు ఒక టిఫిన్ బండిని, పేద వద్ద మహిళకు ట్రై సైకిల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

600 మందికి అన్నదానం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 48వ డివిజన్‌లో మొబైల్ అన్న క్యాంటిన్ ద్వారా 600 మంది నిరుపేదలకు భోజనం అందించినట్లు టిడిపి అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు కేశినేని ఫౌండేషన్ ట్రస్టీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా సహకారంతో మొబైల్ అన్న క్యాంటీన్‌ను బుధవారం 48వ డివిజన్ చిట్టినగర్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాంద్రేగుల రవీంద్ర, 48వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ, సాదరబోయిన ఏడుకొండలు, గణప రాము, కామా దేవరాజు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లుకు నివాళి

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సిపిఎం 45వ డివిజన్ సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు (75) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. వెంకటేశ్వర్లు ఆర్టీసీలో పనిచేసి రిటైరయ్యారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రం రాష్ట్ర బాధ్యులు యువి రామరాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.అప్పన్న, ఐద్వా పశ్చిమ నగర అధ్యక్షురాలు కె.శేషమణి, సిఐటియు పశ్చిమ నగర అధ్యక్షులు ఇ.వి.నారాయణ, ముఠా వర్కర్స్ యూనియన్ నగర సహాయ కార్యదర్శి జి.వెంకట్రావు, సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు, 45వ డివిజన్ శాఖ కార్యదర్శి ఎ.శ్రీనివాస్ 44వ సీనియర్ నాయకులు పుల్లారావు, ఐద్వా నాయకులు విక్రం లక్ష్మి, సిపిఎం నాయకులు అప్పలరాజు, సుదర్శన్, కాంతారావు తదితరులు విద్యాధరపురం లేబర్ కాలనీలోని ఇంటి వద్ద వెంకటేశ్వర్లు భౌతికదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రవీంద్రభారతిలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: రవీంద్రభారతి స్కూల్‌లో చిన్నారులు వివిధ రకాల ఫ్యాన్సీ డ్రస్‌లతో అలరించారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు జాతీయ నాయకుల చరిత్ర, త్యాగాలు, భారతీయ సంప్రదాయాలు, వృత్తులపై అవగాహన కల్పించే విధంగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.అంకమ్మరావు, ఉపాధ్యాయులు రఘూన్సీ, శ్రీ తన్య, అఫ్రీన్, భాను, దేవి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-మైలవరం: 18 ఏళ్లు నిండిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈవో మైలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ లిస్టును ప్రదర్శించి వీఆర్‌వోలకు అందజేశారు. డిగ్రీ విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల ద్వారా విచారించి జనవరి 5వ తేదీకల్లా తుది జాబితాను సిద్ధం చేస్తామన్నారు. మైలవరం నియోజకవర్గ పరిధిలో 293 పోలీంగ్ స్టేషన్ ఉన్నాయని, ఓటర్లు 2,82,304 మంది ఉన్నారన్నారు. ఆధార్ అనుసంధానం 69శాతం పూర్తి చేశామన్నారు.

ధృవీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-మైలవరం: నాబార్డువారు సహకారంతో మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థానిక సీఎంఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాబార్డు జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మిలిందిసౌసాల్కార్ మాట్లాడుతూ 90 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, మార్కెటింగ్ మెళకువలు తెలుసుకుని చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైలవరం, కీర్తిరాయునిగూడెంలో 15 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించినందుకు మథర్ థెరిస్సా చారిటబుల్ అధ్యక్షులు కోయ సుధా, ట్రైనర్స్‌ను అభినందించారు. యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా మేనేజర్ భానుచందర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తమ బ్యాంకు ద్వారా లోన్లు ఇచ్చి కుటీర పరిశ్రమలు పెట్టుకోవటానికి అర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారుమీ కార్యక్రమంలో ట్రైనర్స్ సరిత, భవానీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-భవానీపురం

భవానీపురంలోని ఎస్.ఎం.ఎ.ఖుద్దూస్ ఉర్దూ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు ఉమర్ అలీ ఆధ్వర్యంలో ప్రపంచ "ఉర్దూ" దినోత్సవ వేడుకలు బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు ఆరిఫ్, జాఫర్, సిరాజ్ అహమద్, సందాని, నసీమ, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ఎల్‌బీఆర్‌సీఈలో ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి-మైలవరం

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐటీఎస్ విభాగం ఆధ్వర్యంలో మాచిన్‌లెర్నింగ్ అనే అంశంపై తృతీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. డెటా సైంటిస్టు మెంటన్ సాకేత్‌రెడ్డి, సుప్రజ టెక్నాలజిస్టు వారు ఈ వర్క్‌షాపుకు ముఖ్య అతిధిగా పాల్గొన్నారన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అనాలోచితంగా కెటిరోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-వన్‌టౌన్

అనాలోచితంగా, ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా ఎత్తు పెంచి కె.టి.రోడ్డు నిర్మాణం చేపట్టడంతో చిన్నపాటి వర్షానికి లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయని, దీనివల్ల నివాసితులతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఇన్చార్జ్ పోతిన వెంకట మహేష్ నగరపాలక సంస్థ అధికారుల తీరుపై మండిపడ్డారు. బుధవారం స్థానిక డివిజన్ అధ్యక్షులు బత్తుల. వెంకటేష్, రెడ్డిపల్లి గంగాధర్‌లతో కలిసి కేటీ రోడ్డును పరిశీలించారు. మహేష్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్ పైపులైన్లు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోకుండా అడ్డదిడ్డంగా రోడ్లు వేయటం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చేనేత రాష్ట్ర కార్యదర్శి నెమల సంజీవరావు, నగర అధికార ప్రతినిధి స్టాలిన్ శంకర్, సోమి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీమతి అమరావతి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: తేజస్ ఎలైట్ ఆధ్వర్యంలో శ్రీమతి అమరావతి గత 6 సీజన్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 7వ సీజన్‌లోకి అడుగు పెట్టింది. ఈ సందర్భంగా సిఈవో ప్రదీప్ చౌదరి మాట్లాడుతూ శ్రీమతి అమరావతి 7వ సీజన్ ఆడిషన్స్ దిగ్విజయంగా పూర్తిచేసుకున్న నేటి కార్యక్రమంలో సుమారుగా 45 మంది మహిళలు పాల్గొనటం జరిగింది. అందులో మెరుగైన ప్రతిభ కనబరిచిన 30 మంది మహిళలను ఫైనల్స్‌కు సెలక్ట్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రజని, మారం రోజారాణి న్యా యనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రత్యేక ఆకర్షణగా బిగ్ బాస్ 6 ఫేమ్ షానీ సాల్మన్, బాలీవుడ్ నటి భవ్యశ్రీ పాల్గొన్నారు. నోవాటెల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎస్ఎల్‌వి గ్రూప్ టైటిల్ సాన్సర్‌గా వ్యవహరించారు. నవంబర్ 20 శ్రీమతి అమరావతి సీజన్ 1 ఫైనల్స్ నోవాటెల్‌లోనే నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోయిన్ కామ్నా జెఠ్మలాని, బాలీవుడ్ హీరోయిన్స్ మోబాని స ర్కార్, అలీవియా ముఖర్జీ, జబర్దస్త్ టీమ్, సింగర్స్ విచ్చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీజన్ ఒన్ విన్నర్ మైత్రి దాస్, సీజన్ త్రీ మంజుల, సీజన్ 4 మల్లికా, సీజన్ 6 చంద్రికా విన్నర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.